# మినీకథ

ఫోన్ చేశాడు అప్పటికే నాలుగు సార్లు-

ప్రతిసారీ రెస్పాన్స్ ఒకటే- యంగేజ్డ్ అని. పరమ చికాగ్గా వుంది. అందుకే అతనికి నోటికి వచ్చిన తిట్లల్లా తిట్టాడు ఎక్స్ఛేంజ్ అధికారుల్నీ. టెలిఫోనుల్నీ. ఈ దేశాన్నీ.. వాచీ వంక విసుగ్గా చూశాడు మరోసారి - అప్పుడే తొమ్మిది దాటు తోంది- ఎంతో యిదిగా ఫీల్ అయిపో తున్నాడు రాత్రి నుంచీ వేసుకున్న ప్లానంతా ఫ్లాప్ అయినందుకు. ఈ రోజు ఎంతో హాపీగా ఎంజాయ్ చెయ్యాలని మొద టిగా తనే గ్రీటింగ్ చెప్పాలనీ. ఆ రోజు అతని గర్ల్ ఫ్రెండ్ సౌజన్య పుట్టిన రోజు.

ఆఖరి ప్రయత్నంగా "హల్లో" అన్నాడు మోహన్.

"హల్లో నంబర్ ప్లీజ్."

"నైన్ సిక్స్‌కి ఫోన్ చెయ్యాలి మేడమ్."

"వెయిట్ ఫర్ ఎ వైల్" అంది-నీ మొహం అని మనస్సులో అనుకుని "ఓకే." అన్నాడు క్షణాలు.. సెకనులు.. దొర్లిపోతూ.. కాస్సేపటికి "యంగేజ్డ్" అంది ఆపరేటర్ తియ్యని గొంతుతో. భగ్గున మండింది కడుపు- తోక గట్టిగా తొక్కిన పాములా బుసకొడుతూ "నేను పుట్టింది పంథొమ్మిది వందల అరవైలో...."

"అయితే ..." వెటకారంగా ఆపరేటర్ అంది....

వయస్సు ఇరవై నాలుగేళ్ళు.

"సో వాట్...." ఈసారి కేర్‌లెస్‌గా.

ఎత్తు రెండంగుళాలు తక్కువ ఆరడుగులు బరువు అరవై నాలుగు కేజీలు. బర్త్‌డే సర్టిఫికేట్ ట్రూ కాపీ కావాలో....

నేనూ యంగ్ ఏజ్డేతల్లీ-వోల్డ్‌ఏజ్డ్ కాదు- నైన్ సిక్స్‌కి ఫోన్ చెయ్యాలి అర్జంట్ ప్లీజ్...."

చాలా ఫోర్స్‌గా కొంచెం రిక్వెస్టింగ్‌గా చెప్పాడు ఫోన్‌లో..ఆపరేటర్ తనలో తనే నవ్వుకుంది తమాషాగా.

ఆమె ఫోన్ పెట్టేసి నిశబ్దం.. 'డామిట్' అని కసిగా ఆపరేటర్‌ని తిట్టి ఫోన్ పెట్టేశాడు.... కాళ్ళీడ్చుకుంటూ ఆఫీస్ కెళ్ళక తప్పలేదు. అప్పటికే టైముదాటిపోవడంతో.

* * *




టిప్‌టాప్‌గా తయారై రంగేళీ రాజాలా సరాసరి ఆమె దగ్గరికే బయలుదేరాడు మోహన్— ఎన్ని శాపనార్థాలు పెడు తుందో కౌంట్ చేసుకుంటూ.... ఆమె ఎదు రైంది.... జగదాంబా జంక్షన్‌లో.... "సారీ సౌజన్యా! మార్నింగ్ నీకు ఫోన్..." అంటూ ఏదో చెప్పబోయాడు.

"సారీలేదూ గాడిద గుడ్డూ లేదూ, బీచ్‌కి పోదాంపద...." అంటూ ఆటోలో తీసు కెళ్ళింది రామకృష్ణా బీచ్‌కి....ఆమె నవ్వు తూండేసరికి ఆశ్చర్యపోయాడు....ఒడ్డున కూర్చుని యిసకలో పిచ్చి గీతలు గీస్తూ మొదలుపెట్టింది యిలా-

"నేను పుట్టింది పందొమ్మిది వందల అరవైలో....వయసు యిరవై నాలుగేళ్ళు" నవ్వు తెరలు తెరలుగా స్వచ్ఛమైన కెర టాల్లా మెరిపేతారకల్లా-విరిసేమరుమల్లెల్లా- స్టన్ అయ్యాడు మోహన్-ఆశ్చర్యంలోంచి తేరుకునేలోపుగానే....

"మోహన్! నువ్వు ఫోన్ చెస్తావని తెల్సి మార్నింగ్ సెవెన్‌థర్టీకల్లా ఎక్స్ఛేంజ్‌కి వెళ్ళా.... ఆపరేటర్ సృజనా నా ఫ్రెండే. ఆమెను రిక్వెస్ట్ చేసి నేనే ఫోన్‌లో మాట్లాడాను. నిన్ను ఉడికించాలని నేనే 'ఎంగేజ్డ్' అని చెప్పా" అని యింకా ఏదో చెబుతూనే వుంది నిండుగా నవ్వుతూ.

ఆమెను అమాంతం కౌగలించుకుని ముద్దులతో ముంచెత్తాడు "యూ నాటీ" అంటూ.

